క్లుప్తంగా

సామూహిక సీమంతాలు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్ పక్కన కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన శుక్రవారం సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ లకావత్ సైదులు పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్బన్ సీడీపీఓ బి.వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అన్నప్రాసన..



అన్నప్రాసనలో పాల్గొన్న కార్పొరేటర్ వైష్ణవి ప్రసన్నకృష్ణ

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 46వ డివిజన్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపాక సిబ్బంది సేవలను కొనియాడారు. టీచర్లు నాగలక్ష్మి, సంధ్య, సత్యవతి, శారద, గురవమ్మ, ఆలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహకాలు..



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న సేవా సమితి సభ్యులు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యాన శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆర్థిక సాయం, రూ.10 వేల విలువైన వస్తువులు అందించారు. ఈ సందర్భంగా సమితి బాధ్యులు మాట్లాడుతూ.. గర్భిణీ, బాలింతల కోసం కుర్చీలు, ఫ్యాన్, మంచినీళ్ల క్యాన్, టేబుల్, ర్యాక్ తదితర వస్తువులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ ఎంపీడీఓ ఏనుగు సురేష్‌బాబు, సుమన్ బాబు, సంస్థ సభ్యులు ఎంపీ దాస్, సీడీపీఓ వీరభద్రమ్మ, తల్లాడ ఏపీఓ కోటయ్య, పంచాయతీ కార్యదర్శి, కృష్ణ పాల్గొన్నారు.

పాము కాటు

నేలకొండపల్లి: మొక్కజొన్న కంకులు ఏరుతుండుగా ఓ మహిళా కూలీ పాము కాటుకు గురైంది. మండలంలోని సదాశివాపురానికి చెందిన కుమారి శుక్రవారం గ్రామంలో మొక్కజొన్న కంకులు ఏరుతోంది. ఈక్రమంలో ఆమె కాలిపై పాము కాటేయగా.. నేలకొండపల్లిలో చికిత్స అందించాక ఖమ్మంకు తరలించారు.

చెత్త తొలగింపు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్‌లో ఉన్న లకారం చెరువుకు సాగర్ నీరు తరలించే కాల్వలో పేరుకుపోయిన చెత్త నిల్వలను శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. ఖమ్మం కేఎంసీ పార్క్‌లోని కాల్వలో నీటి ప్రవాహంతో కొట్టుకొచ్చిన వాటర్ బాటిళ్లు, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నేలకొండపల్లి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	28		20
బెండకాయ	24	పాలకూర	4
పచ్చిమిర్చి	38		20
కాకర	28	చుక్కకూర	4
బీట్‌రూట్	26		20
బీర	48	తోటకూర	4
దొండ	18		20
పొట్లకాయ	34	గోంగూర	4
చిక్కుడు	80		20
గోరుచిక్కుడు	44	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		30
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	28		20
క్యాప్సికం	54	-ఖమ్మం వ్యవసాయం	

యూటర్న్ కష్టాలు..!



మయూరిసెంటర్ బ్రిడ్జి వద్ద యూటర్న్ తీసుకునేందుకు వీలులేకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

నగరంలోని ప్రధాన కూడలిగా ఉన్న మయూరిసెంటర్‌లో యూటర్న్ లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్ డిపో రోడ్డుకు వెళ్లాలన్నా, మయూరిసెంటర్ నుంచి యూటర్న్ తీసుకోవాలన్నా బ్రిడ్జి కింద నుంచి తిరిగి రావాల్సి వస్తోంది. బ్రిడ్జి పక్కన ఆటోలు, ఎదురుగా వచ్చే వాహనాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. అదే మయూరిసెంటర్‌లో సిగ్నల్ ఏర్పాటు చేస్తే బస్ డిపో రోడ్డుకు వెళ్లే వారే కాకుండా అటు, ఇటు నుంచి వచ్చే వారికి ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడ యూటర్న్ ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ఇక ఈ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో రోడ్డు కూడా ఇరుకుగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



వినియోగంలో లేని సిగ్నళ్లు



బ్రిడ్జి పక్కనుంచి వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా ఆపిన ఆటోలు

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కైకొండాయిగూడెంలో బ్లూమింగ్‌మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆడిటోరియాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కొద్దిసేపు సరదాగా షటిల్ ఆడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమని గుర్తించి ప్రత్యేకంగా ఆడిటోరియం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆడిటోరియంలో ఇండోర్ గేమ్స్ ఆడేందుకు అనువుగా నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ భీమిరెడ్డి గౌతంరెడ్డి, ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, ఎన్‌సీసీ బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్పొరేటర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగటి ఉపేందర్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని దానవాయిగూడెం 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ నాగార్జున శుక్రవారం తెలిపారు. దీంతో సారథినగర్, రామాలయం వీధి, సాయిబాబా టెంపుల్ లైన్, బీరప్ప టెంపుల్ ప్రాంతం, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, జూబ్లీస్కూల్, జూబ్లీపురం, రెయిన్‌బో కాలనీ, దానావాయిగూడెం, రామన్నపేట, సబ్‌జైల్ ఏరియా, కామంచికల్లు, జాన్‌బాద్‌తండా, దారేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ చెప్పారు. అలాగే ఎన్నెస్పీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 ఏఈ జి.వెంకన్న తెలిపారు. దీంతో గట్టయ్యసెంటర్, బైపాస్ రోడ్, ఆర్టీఓ కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సన్న బియ్యం పంపిణీ



నెమలిపురిలో పంపిణీని ప్రారంభిస్తున్న గోపాల్‌రెడ్డి

కామేపల్లి: మండలంలోని పాతలింగాల, కొత్తలింగాల, నెమలిపురి, గోవింద్రాల గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సన్న బియ్యంతో పాటు మరో 9 రకాల సరుకులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, రాంరెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మాలపాటి సత్యనారాయణ, తోటకూరి శివయ్య, ధరావత్ అనురాధ, వెంకటనర్సయ్య, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెల్ల రేషన్‌కార్డుల సంఖ్య తగ్గింపు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: తెల్ల రేషన్‌కార్డుల జారీకి సంబంధించి రకరకాల కారణాలు చూపి రేషన్ కార్డుల సంఖ్యను తగ్గించేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉపాధి అవకాశాలు లేని పరిస్థితుల్లో కొందరు జీరో చెల్లింపుపై వాహనాలను తీసుకున్నారని, అటువంటి వారికి రేషన్ కార్డు రాదంటూ కొత్త నిబంధనలను తెర మీదకు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట ఆదాయం లోపు ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. జిల్లాలో మొక్కజొన్న సాగుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలన్నారు. అననుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యాన ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లకు సంబంధించి ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు సత్వర రవాణాకు చర్యలు చేపట్టాలని అన్నారు.

నేడు పుట్టకోటలో సీపీఐ సమావేశం..

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సమావేశం శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పుట్టకోటలో జరగనుంది. భూ కబ్జాలు, ల్యాండ్ సుపారీ గ్యాంగుల చర్యలను నిరసిస్తూ ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ఇటీవల స్థానికేతరులు కొందరు భూ హక్కు కలిగిన వారిని బెదిరిస్తూ గ్యాంగులతో అక్రమ స్వాధీనానికి పాల్పడుతున్న నేపథ్యంలో సీపీఐ ఈ సమావేశం నిర్వహిస్తుందని తెలిపింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, నగర కార్యదర్శి ఎస్ కె జానిమియాతో పాటు రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు హాజరు కానున్నారు.

రేషన్ షాపు తనిఖీ..



తెట్టెలపాడులో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుధీర్

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు రేషన్ షాపులో సన్నబియ్యం పథకం అమలు తీరును శుక్రవారం తహసీల్దార్ సుధీర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, రేషన్ తీసుకున్న వారి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో కొత్తగా రేషన్‌కార్డులపై విచారణ చేశారు. సివిల్‌సప్లై డీటీ విజయ్‌బాబు ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లు అభినందనీయం..

ఖమ్మంవన్‌టౌన్: బీసీల రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేయడం అభినందనీయమని జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో మండల, పట్టణ, నగర బీసీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా బీసీల ఆధ్వర్యాన అభినందన సభ భారీగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నూతి సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై విశ్రాంత ఉద్యోగుల ధర్నా



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

ఖమ్మం మామిళ్లగూడెం: సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం ఖమ్మం ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఆప్రా) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తూము నరసింహారావు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు జె.నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. ఆర్టీసీ నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించడంతో పాటు తమ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో మేనేజర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) వీరన్నకు వినతిపత్రం అందజేశారు. పగిళ్లపల్లి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం రీజినల్ సహాయ కార్యదర్శి వి.రమేష్, డిపో కమిటీ అధ్యక్షుడు పగళ్లపల్లి నరసింహారావు, సహాయ కార్యదర్శి గడ్డం వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బుగ్గవీటి లింగమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దెల బాబు, నాయకులు ఖయ్యూం, ఎండీ గౌస్, సంఘం నాయకులు వీరభద్రయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రామారావు, మధుసూదనరావు, వెంకన్న, భాషా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

● నిర్మాణాల అనుమతులను పరిశీలించాలి



వార్డు ఆఫీసర్లకు శిక్షణ ఇస్తున్న ఏసీపీ వసుంధర

ఖమ్మంమయూరిసెంటర్: క్షేత్రస్థాయిలో భవన నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి వార్డు ఆఫీసర్లు ఆయా నిర్మాణాలకు ఉన్న అనుమతులను పరిశీలించాలని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర సూచించారు. వార్డు ఆఫీసర్లకు రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా కేఎంసీ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ విభాగంపై నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర, సుడా డీసీపీ రాజ్‌కుమార్ భవనాల నిర్మాణాలకు అనుమతులు ఎలా జారీ చేస్తారు, నిర్మాణాలను ఎలా పరిశీలించాలి, అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలకు ఎలా జరిమానాలు విధించాలి, టౌన్‌ప్లానింగ్ విభాగ విధులు వంటి వాటిపై వార్డు ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. భవనాలు నిర్మించే సమయాన యజమానులు నిర్మాణాల ప్రాంతంలో అనుమతిపత్రాలను ఏర్పాటు చేయాలని, వార్డు ఆఫీసర్లు అనుమతుల ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయా.. లేదా అని చూసి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.

● పండ్ల వ్యాపారులకు జరిమానా..

నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోడ్డు వెంట పండ్లు పోసి విక్రయిస్తున్న వ్యాపారులకు కేఎంసీ అధికారులు రూ.5 వేల జరిమానా విధించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా పండ్లను రోడ్ల వెంట పోయొద్దని హెచ్చరించారు. డీఆర్ఎఫ్ సిబ్బందితో రోడ్డు వెంట పోసిన పుచ్చకాయలను తొలగించారు.

● ఎస్ఐకి షోకాజ్ నోటీసు..


విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారంటూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్‌కు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ నోటీసు జారీ చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో నిర్లక్ష్యం, అధికారుల ఆదేశాలు పాటించడంలో అలసత్వం వహించినందుకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభల వాల్ పోస్టర్లు..

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభల వాల్ పోస్టర్లను ఆహ్వాన సంఘం చైర్మన్ మువ్వా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు రవి మారుతి, వైస్ చైర్మన్ వీరారెడ్డి సంఘ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్‌లు ఆవిష్కరించారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మం కేంద్రంగా నిర్వహించే ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ మాజీ నాయకులు నర్రా రమేష్, కల్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, మాజీ జిల్లా అధ్యక్షులు కేవీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● దొడ్డి కొమురయ్య జయంతి వాల్ పోస్టర్లు..



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఖమ్మంలో దొడ్డి కొమురయ్య వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ రహమాన్, ఐలయ్యలు మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రపై సినిమాను రూపొందించి అభినందనీయమన్నారు. అనంతరం చిత్ర దర్శకుడు ఎం.సేనాపతి మాట్లాడగా.. కార్యక్రమంలో దొడ్డి చంద్రం, కురుమ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు తూముల అరుణ్ కుమార్, కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గొరిగి నరసింహ, జంపుల భగవాన్దాస్‌లతో పాటు సంపత్, కృష్ణ, జైహింద్, రాజకుమారి, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, జయ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



చెక్కు అందిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంవన్‌టౌన్: సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్లలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎర్రం బాలగంగాధర తిలక్, కన్నం వైష్ణవి, ప్రసన్నక్రిష్ణ, బోజడ్ల సత్యనారాయణ, శంకర్‌నాయక్, సింగం అంజయ్య, నాళం సతీష్, లక్ష్మీనారాయణ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నయాబజార్ హైస్కూల్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల భవిష్యత్ తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ అన్నారు. శుక్రవారం నగరంలోని నయాబజార్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఇటీవల వచ్చిన వరదతో నష్టం జరగ్గా.. వాటి మరమ్మతులకు సహకరించిన పలువురు దాతలను సన్మానించారు. హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు మాధవరావు, సురేష్, విజయ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో ఉన్న టోల్‌గేట్ వద్ద శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఖమ్మానికి చెందిన బ్యాంక్ ఉద్యోగి పాపాచారీకి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈమేరకు టోల్‌గేట్ సిబ్బంది 108 ద్వారా నేలకొండపల్లికి ఆపై ఖమ్మంకు తరలించారు.

దివ్యాంగులను ప్రోత్సహించేందుకే..

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్యాంగులను ప్రోత్సహించడమే మిత్ర దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమని ట్రస్ట్ చైర్మన్ విశ్వేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధిపొందని దివ్యాంగులకు తగిన ప్రోత్సాహం ఇస్తూ, అర్హులైన వారికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 91827 18598, 98499 39108 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సభ్యులు తిరుపతి, జగన్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి

కూసుమంచి: రేషన్ దుకాణాల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టకుండా ఉన్న డీలర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పలు దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పీఎం గరీబ్ కల్యాణ్ అన్నయోజన ద్వారా కేంద్రం పేదలకు ఉచితంగా ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున బియ్యం అందిస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికీ ఒక కిలో బియ్యం అందించి మొత్తం తామే అందిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. రేషన్ దుకాణాల్లో సీఎం ఫొటోతో పాటు ప్రధాని ఫొటో కూడా తప్పనిసరిగా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వేణు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, ముస్లింలపై కక్షసాధింపు చర్యలను మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. శుక్రవారం ముస్లింల హక్కులను హరిస్తున్న మోదీ ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ మస్జీద్-ఎ-వాహిదియా కమిటీ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ.. వక్ఫ్ భూములు కాజేయాలనే కుట్రతో సవరణ పేరుతో నల్ల చట్టాలను చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి, ముఫ్తీ అమీర్ హమ్జ, అవాజ్ గౌస్, ఎండీ రెహమాన్, రసూల్, షకీల్, అబ్దుల్, ఎండీ ఇస్మాయిల్, మస్తాన్, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న కూలీల కొరత..

● ఇతర రాష్ట్రాల కూలీల తిరుగు పయనం
● స్థానిక కూలీలకు పెరిగిన డిమాండ్
● ఫలితంగా ఖర్చు పెరిగి ఆదాయం తగ్గుతున్న వైనం
● జిల్లాలో 59వేల ఎకరాల్లో మిర్చి సాగు




పండితాపురంలో ఎండిపోతున్న మిర్చి పంట

కామేపల్లి: ఎన్నో ఒడుదుడుకులను అధిగమిస్తూ పంటలు సాగు చేసిన రైతులు సకాలంలో ఆ పంటను చేజిక్కించుకోకుంటే నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఒకే రకమైన పంటను చాలామంది రైతులు సాగు చేయించడంతో కూలీల కొరత ఏర్పడి నష్టపోతున్న పరిస్థితి కనపడుతోంది. ఖమ్మం జిల్లాలో ఎక్కువగా మిర్చి పంటను సాగు చేస్తుండగా.. ఈ ఏడాది 59 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. డిసెంబర్ చివరిలో మిర్చి కోతలు ప్రారంభించగా.. ఇప్పటి వరకు మొదటి మిర్చి కోతలు పూర్తయినవి.

ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు..

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది వలస కూలీలు ప్రతి ఏటా జిల్లాలోని పలు మండలాల రైతుల వద్దకు చేరుకుని మిర్చి పంట కోతలు చేపట్టి తిరిగి హోలీ తర్వాత వారి స్వస్థలాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలోనే రైతులకు కూలీల సమస్య ప్రధానంగా ఏర్పడుతుంది. దీంతో స్థానిక కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. ఇదే అదనుగా భావించిన స్థానిక కూలీలు కేజీల చొప్పున కొస్తామని చెప్పి ధరను పెంచడంతో రైతులకు ఖర్చు పెరిగి ఆదాయం తగ్గుతుంది. భూగర్భ జలాలు సైతం తగ్గిపోతుండడంతో పంటలు ఎండిపోతున్న పరిస్థితి కూడా రైతులకు ఇబ్బందిగానే మారింది. సకాలంలో పంట కోత కోయించకుంటే పంట నాణ్యత తగ్గి మార్కెట్‌లో ధర తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కేజీకి రూ.25 చెల్లిస్తున్నా..



రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేయగా మొదటి కోత వలస కూలీలతో ఒక కేజీ రూ.11 చొప్పున చెల్లించా. కాని వారు తిరిగి వెళ్లిపోవడంతో స్థానిక కూలీలకు డిమాండ్ పెరిగింది. పంట నాణ్యత తగ్గితే నష్టపోతానని స్థానిక రైతులకు కేజీ రూ.25 చొప్పున ఇచ్చి మిర్చి కోత కోయిస్తున్న. అదనంగా రవాణా ఖర్చు భరించాల్సి ఉంటుంది.

– జంగా నారాయణరెడ్డి, రైతు, పండితాపురం

59 వేల ఎకరాల్లో సాగు..



ఈ ఏడాది జిల్లాలో 59 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఎక్కువగా మిర్చి సాగుపై దృష్టి పెట్టడంతో ఒకేసారి పంట కోతకు వస్తుంది. దీంతో కూలీల సమస్య ఏర్పడుతుంది. సకాలంలో పంట కోత చేపట్టాలనే ఉద్దేశంతో మిర్చి కోతకు అదనంగా ధరను నిర్ణయించి కోయిస్తున్నారు. దీంతో రైతులకు అదనపు భారం పడుతుంది.

– ఆకుల వేణు, వైరా డివిజన్ ఉద్యాన అధికారి